సాక్షి
కాకినాడ

బుధవారం | 16 | ఏప్రిల్ | 2025




ఈదుకుంటూ మృత్యుఒడికి..
వేసవి కాలం వచ్చేసింది.. విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. దీంతో, పలువురు నదులు, సముద్రంలో ఈతకు వెళ్లి ఊహించని రీతిలో మృత్యువాత పడుతున్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి అవమానం
మండల కేంద్రమైన శంఖవరంలో గుర్తు తెలియని దుండగులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి, అవమానించారు. దీనిపై దళితులు భగ్గుమన్నారు.

8లో

డెల్టా కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 6,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,300, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ సిటీ: రైతుల నుంచి మద్దతు ధరకే రబీ ధాన్యం కొనుగోలు చేస్తామని కలెక్టర్ షణ్మోహన్ ప్రకటించారు. 'రైతు కంట కన్నీరు' శీర్షికన 'సాక్షి' మంగళవారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. జిల్లాలో ఇప్పటికే 225 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతుల వద్ద మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం ఆరబెట్టిన చోట గాని, కొనుగోలు కేంద్రంలో గాని సాంకేతిక సిబ్బంది పరిశీలించి, డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వెహికల్ మూమెంట్ జీపీఎఫ్ ట్రాక్ చేసి మిల్లుకు పంపిస్తామని వివరించారు. అలా చేసిన రైతులకు మద్దతు ధర లభిస్తుందని, సరైన సమయంలో వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడతాయని చెప్పారు. పండించిన ధాన్యం నేరుగా మిల్లులకు అమ్మి, తిరిగి రైతు సేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని సిబ్బందిని ఆన్‌లైన్ చేయాలంటూ అడుగుతున్నారని, అటువంటి వారికి డబ్బులు సక్రమంగా పడకపోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యాన్ని దళారులు, రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 2,570.480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 207 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. ధాన్యం సేకరణకు అవసరమయ్యే గోనె సంచులను, హమాలీలను, రవాణా వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో 225 మంది సాంకేతిక నిపుణులను, 225 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను, 225 మంది హెల్పర్లతో పాటు వెహికల్ మూమెంట్ అధికారులను, కస్టోడియన్ అధికారులను నియమించామని వివరించారు. సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,300, 75 కిలోలకు రూ.1,725, గ్రేడ్-ఎ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, 75 కిలోలకు రూ.1,740 చొప్పున మద్దతు ధర అందిస్తామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

వర్సిటీ ప్రగతికి ప్రణాళికలు రూపొందించాలి

రాజానగరం: యూనివర్సిటీ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నూతన ఆలోచనలతో అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మంగళవారం నిర్వహించిన ఇంటరాక్షన్ ప్రోగ్రాంలో ఆమె పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన డీఆర్‌డీఓ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లేబొరేటరీ సైంటిస్టు కె.వీరబ్రహ్మం మాట్లాడుతూ, సమాజానికి ప్రయోజనం చేకూర్చేలా ప్రాజెక్టు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వివిధ సంస్థల నుంచి యూనివర్సిటీకి సీఎస్ఆర్ నిధులు తీసుకువచ్చి, అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ తల్లికి రూ.5.78 లక్షల ఆదాయం



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక సూర్యారావుపేటలో వెలసిన నూకాలమ్మ అమ్మవారి హుండీల ఆదాయాన్ని మంగళవారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 33 రోజులకు గాను రూ.5.78 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారిని దర్శించుకొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారన్నారు.

25న జాబ్ ఫెస్ట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కాలేజియేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సహకారంతో స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 25న జాబ్ ఫెస్ట్-2025 నిర్వహించనున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. డిగ్రీ, పీజీ ఫైనలియర్ చదువుతున్న, పాసైన విద్యార్థులకు 40 కంపెనీలతో ఈ జాబ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జాబ్ ఫెస్ట్ ఏర్పాట్లపై సంబంధిత ప్రిన్సిపాళ్లు, ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది తదితరులతో చర్చించారు. జాబ్ ఫెస్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రతి కళాశాల నుంచి విద్యార్థులందరూ హాజరై, జాబ్ ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టు వదిలేస్తున్నారు

- సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- నష్టాల బాటలో పరిశ్రమ
- పవన్ ఇలాకాలో పంటకు విరామం
- పట్టు పరిశ్రమ చరిత్రలోనే తొలిసారి..
- సిల్క్ సిటీ కట్టాక పంట వేస్తామంటున్న రైతులు

పిఠాపురం: 'పట్టు'కుంటే బంగారం.. ఇది ఒకప్పటి మాట. 'ముట్టుకుంటే మట్టే'.. ఇది ఇప్పటి మాట. రైతులను అపర కుబేరులుగా చేసిన పట్టు సాగు ఇప్పుడు రైతులను నట్టేట ముంచుతోంది. స్వదేశీ సిల్క్ ఉత్పత్తిలో రాష్ట్రంలో కీలక పాత్ర వహించిన గొల్లప్రోలు మండలంలో పట్టు పంటకు గడ్డుకాలం మొదలైంది. ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో సరైన ధర రాక, పంట కొనే వారు లేక, పెట్టుబడి దక్కక, కనీసం కౌలుకు తీసుకునే వారు కూడా ఉత్సాహం చూపకపోవడంతో పట్టు రైతులు పంటకు విరామం ప్రకటిస్తున్నారు. దీనిలో భాగంగా గొల్లప్రోలు మండలంలో మల్బరీ తోటలను కొన్ని రోజులుగా దున్నేస్తున్నారు. ఒక్క గొల్లప్రోలు మండలంలోనే సుమారు 400 ఎకరాల్లో మల్బరీ సాగు జరుగుతూండగా.. ప్రస్తుతం వందల ఎకరాల్లో రైతులు పంటను దున్నేసి, వేరే పంటలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. 'మీకు అండగా ఉంటా. పట్టు పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా. సిల్క్ సిటీ నిర్మిస్తా' అంటు వాగ్దానాలు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి ఇలాకా పిఠాపురం నియోజకవర్గంలోనే రాష్ట్రానికే వన్నె తెచ్చిన పట్టు పరిశ్రమ మూత పడే పరిస్థితులు ఎదురయ్యాయని రైతులు వాపోతున్నారు.

కానరాని ప్రభుత్వ తోడ్పాటు

రాష్ట్రంలో పలమనేరు, హిందుపురంతో పాటు జిల్లాలోని గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టు గూళ్ల కొనుగోలు కేంద్రాలున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 5, జిల్లాలోని పెద్దాపురం డివిజన్‌లో 12, కాకినాడ డివిజన్‌లోని 2 మండలాల్లో 4,500 ఎకరాల విస్తీర్ణంలో 1,150 మంది రైతులు మల్బరీ సాగు చేస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో మల్బరీ సాగుకు రూ.లక్ష పెట్టుబడి అవుతోంది. అలాగే, పట్టు పురుగుల పెంపకానికి 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పున షెడ్ నిర్మాణానికి రూ.15 లక్షల వరకూ ఖర్చవుతోంది. దీని నిర్వహణకు రూ.50 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. గతంలో ఇక్కడ పండించిన పట్టుగూళ్లకు కేజీకి రూ.550 వరకూ ధర వచ్చేది. ప్రస్తుతం రూ.250కి కూడా కొనేవారు లేకపోవడంతో తీవ్ర నష్టాల పాలవుతున్నామని రైతులు వాపోతున్నారు. మరోవైపు ప్రభుత్వం మల్బరీ రైతులకు ఇన్సెంటివ్‌లు ఇవ్వాల్సి ఉండగా రూ.లక్షల్లో బకాయి పెట్టింది. పైగా షెడ్ల నిర్మాణానికి ఇచ్చే ప్రోత్సాహకాలు సైతం ఇవ్వడం లేదు. ఫలితంగా కొత్తగా పట్టు సాగు చేయడానికి ఏ ఒక్క రైతూ ముందుకు రావడం లేదు.

తెగుళ్ల దాడి

ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో పాటు ఉధృతంగా వ్యాప్తి చెందుతున్న తెగుళ్లు మల్బరీ పంటను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయని రైతులు వాపోతున్నారు. గత ఏడాది ఊజీ ఈగ దాడితో పాటు వివిధ రకాల తెగుళ్లతో పట్టు పురుగులు గూళ్లు కట్టలేదు. ఫలితంగా పట్టు సాగు తీవ్రంగా దెబ్బ తింది. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేయగా శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించారు. మల్బరీ తోటలకు పక్కన ఉన్న పంటలకు పురుగు మందులు వాడటం వలన పట్టు పురుగులు చనిపోతున్నాయని చెప్పి చేతులు దులిపేసుకున్నారని రైతులు విమర్శిస్తున్నారు. పంట నష్టాలకు కారణమైన అసలు తెగులును గుర్తించి, నివారణ చర్యలను అధికారులు ఇప్పటికీ చెప్పలేకపోయారని అంటున్నారు. ఫలితంగా పంట నష్టాల పాలై, సాగు మానేసే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రోత్సాహం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పట్టు సాగుకు ప్రోత్సాహం ఇచ్చేవారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న బకాయిలు రూ.3 కోట్ల వరకూ విడుదల చేసి, రైతులకు పంపిణీ చేశారు. నాటి ప్రభుత్వం ప్రోత్సాహం పెంచడంతో రైతులు మల్బరీ సాగుపై ఆసక్తి చూపారు. గతంలో మల్బరీ సాగుకు, షెడ్ల నిర్మాణానికి యూనిట్ విలువ రూ.7 లక్షల వరకూ ఉండగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యూనిట్ విలువను రూ.10 లక్షలకు పెంచింది. దీనిలో పట్టు పరిశ్రమ ద్వారా రూ.3 లక్షలు, రైతు వాటా రూ.లక్ష, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.6 లక్షల మేర ఆర్థిక సహాయం అందజేశారు. అంటే రైతు కేవలం రూ.లక్ష పెట్టుబడి పెడితే ప్రభుత్వం రూ.9 లక్షలు ఇచ్చేది. బయోల్టిన్ (తెలుపు) రకం పట్టు గూళ్ల కేజీకి రూ.50, సీబీ(ఎల్లో కలర్)కి రూ.20 చొప్పున ప్రభుత్వం ఇన్సెంటివ్ ఇచ్చేది. పలమనేరు, హిందూపురం, హనుమాన్ జంక్షన్ వంటి ప్రాంతాలకు కాకుండా, చేబ్రోలు మార్కెట్‌లోనే కొనుగోళ్లు జరిపేవారు. గత ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహించడంతో అప్పట్లో కేజీ పట్టు గూళ్లు రూ.900 వరకూ అమ్ముడైన సందర్భాలున్నాయి.





చేబ్రోలులో మల్బరీ తోటలను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న రైతు

జిల్లాలో పట్టు సాగు వివరాలు

సాగు చేస్తున్న మండలాలు	19
పట్టు సాగు జరుగుతున్న గ్రామాలు	155
రైతులు	1,150
సాగు విస్తీర్ణం	4,500 ఎకరాలు
రోజుకు పట్టుగూళ్ల దిగుబడి	5 టన్నులు

రైతులతో మాట్లాడుతున్నాం

"పట్టు సాగులో నష్టాలు వస్తున్నాయంటూ రైతులు మల్బరీ తోటలను దున్నేస్తున్న వైనంపై ఆరా తీస్తున్నాం. వారితో మాట్లాడి, నష్టాల నివారణకు చర్యలు తీసుకుంటాం. పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పంట సాగు ఆపకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో చర్చిస్తాం."

– మోసయ్య, పట్టు పరిశ్రమ శాఖాధికారి, చేబ్రోలు

ఆదుకుంటానన్న పవన్.. పట్టించుకోవడం లేదు



ఎన్నికల్లో మా గ్రామం వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాకు న్యాయం చేస్తానని మాట ఇచ్చారు. పదవి వచ్చాక మాకు అండగా ఉంటానన్నారు. సిల్క్ సిటీ కడతానన్నారు. కానీ, పెద్దగా ఏమీ పట్టించుకున్నది లేదు. నేను రెండెకరాల్లో పంట సాగు చేశాను. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు. రావాల్సిన ఇన్సెంటివ్‌లూ రావడం లేదు. మరోపక్క తెగుళ్లు తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. షెడ్ నిర్వహణ భారంగా మారింది. పెట్టుబడులు పెరిగిపోయాయి. దిగుబడీ లేదు. ధర దారుణంగా పడిపోయింది. ఎవరూ కొనేవారు లేరు. రూ.లక్షల్లో నష్టం వచ్చే పరిస్థితి ఉండటంతో పంట తీసేస్తున్నాం. మల్బరీ సాగు ఆపేసి వేరే పంటలు వేసేందుకు నాతో పాటు చాలా మంది రైతులు సిద్ధమవుతున్నారు.

– ఓరుగంటి శ్రీను, పట్టు రైతు, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

అందుకే తోట తొలగిస్తున్నా..



పట్టు పురుగుల పెంపకం 15 సంవత్సరాలుగా చేపడుతున్నాను. ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం చాలా ఒడుదొడుకులు, నష్టాలు చవి చూశాం. చేతికందే దశలో ఉన్న పంటలు అంతు చిక్కని తెగుళ్లతో దెబ్బ తిన్నాయి. పండిన కొద్దిపాటి పంటకు ధర లేక, రాబడి కూలి ఖర్చులకు కూడా సరిపోలేదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇన్సెంటివ్ ఇస్తానని హామీ ఇచ్చారు. నేటి వరకూ పట్టించుకోలేదు. అప్పుల పాలై పట్టు పురుగుల పెంపకం విరమించుకోవాలనుకుంటున్నాను. అందుకే మూడెకరాల్లో మల్బరీ తోటను తొలగిస్తున్నాను.

– ఓరుగంటి గణపతి, పట్టు రైతు, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

అంబేడ్కర్‌కు ఘన సత్కారం



అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, అధికారులు. చిత్రంలో కుటుంబ సభ్యులు

కాకినాడ క్రైం: అనాథ శవాలను తరలించి అంత్యక్రియలు నిర్వహిస్తూ, సేవలో తరిస్తున్న కాకినాడకు చెందిన కూపర్ భాను అంబేడ్కర్‌ను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఘనంగా సత్కరించారు. కలెక్టర్ ఆహ్వానం మేరకు కుటుంబ సమేతంగా అంబేడ్కర్ మంగళవారం కలెక్టరేట్‌కు వెళ్లి సత్కారాన్ని అందుకున్నాడు. అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న అంబేడ్కర్ మానవత్వాన్ని వివరిస్తూ 'అతడే ఆ నలుగురు' శీర్షికన 'సాక్షి' ఈ నెల 13న ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన కలెక్టర్.. అంబేడ్కర్ మానవత్వానికి చలించిపోయారు. ఆయనను నేరుగా చూడాలని సంకల్పించానని చెప్పారు. ఈ తరహా సేవ చేయాలనే ఆలోచన ఎలా వచ్చిందో అంబేడ్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ స్థితిగతులు, ఆర్థిక పరిస్థితిపై ఆరా తీశారు. అంబేడ్కర్‌కు సొంత ఇల్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంబేడ్కర్‌ను సత్కరించేందుకు వివిధ శాఖల ఉన్నతాధికారులను కలెక్టర్ తన కార్యాలయానికి పిలిపించారు. వారి సమక్షంలో అంబేడ్కర్‌ను ఘనంగా సత్కరించారు. ఏ అవసరం వచ్చినా అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌కు ఆర్థిక సాయం అందించారు.

సంద్రం వీడి.. తీరం చేరి..

ఉవ్వెత్తున ఎగసి పడే అలలను చీల్చుకుంటూ.. సాగరంతో సయ్యాటలాడుతూ.. రేయింబవళ్లు నడిసంద్రంలో జీవన పోరాటం చేసే మత్స్యకారులకు రెండు నెలల పాటు విశ్రాంతి లభించింది. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు బంగాళాఖాతంలో చేపల వేటపై బుధవారం నుంచి నిషేధం అమలులోకి వచ్చింది. జూన్ 14వ తేదీ వరకూ ఈ నిషేధం అమలు కానుంది. దీంతో, పది నెలలుగా సముద్రంలో చేపలు వేటాడుతూ జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులు వేటను నిలిపివేశారు. చాలా వరకూ బోట్లు ఇప్పటికే తీరానికి చేరుకున్నాయి. సముద్రం మధ్యన.. సుదూర ప్రాంతంలో ఉన్న బోట్లు మాత్రం తీరం చేరేందుకు ఒకటి రెండు రోజులు పట్టే అవకాశముంది. కాకినాడ ఫిషింగ్ హార్బర్, కుంభాభిషేకం, జగన్నాథపురం ఏటిమొగ వద్దకు భారీగా బోట్లు చేరుకున్నాయి. వాటిని యజమానులు భద్రంగా కాపాడుకుంటున్నారు. అవసరమైన వాటికి మరమ్మతులు నిర్వహించుకోనున్నారు.



– కాకినాడ రూరల్

చిన్నబాబు వచ్చారు.. బహుపరాక్!

- అన్నవరం దేవస్థానంలో ఓ అధికారి పుత్రరత్నం నిర్వాకం
- ఆయన షాడో యాక్షన్‌తో హడలెత్తుతున్న సిబ్బంది
- అన్నింటా ఆయన పెత్తనమే..



అన్నవరం: కలెక్టరేట్‌లో జరిగే అధికారిక సమావేశాల్లో కలెక్టర్‌తో కలిసి ఆయన పుత్రరత్నం పాల్గొంటే ఎలా ఉంటుంది? ఓ ఎస్పీ కుమారుడు పోలీస్ స్టేషన్లు తనిఖీ చేస్తానంటే..! పోనీ ఒక అధికారి ఉపయోగించాల్సిన వాహనాన్ని ఆయన కుమారుడు యథేచ్ఛగా ఉపయోగిస్తూంటే..! డ్యూటీకి రాకుండా ఎక్కడకు వెళ్లావంటూ సిబ్బందిపై ఆ అధికారి కొడుకు ఆగ్రహం వ్యక్తం చేస్తూంటే..? మరోచోటైతే ఇవి సాధ్యం కాకపోవచ్చునేమో! కానీ అన్నవరం దేవస్థానంలో మాత్రం ఇటువంటి తంతు నాలుగు నెలలుగా యథేచ్ఛగా సాగిపోతోంది. సత్యదేవుని సన్నిధిలో ఓ అధికారి పుత్రరత్నం తమపై ఎక్కడా లేని పెత్తనం చేస్తున్నారంటూ సిబ్బంది, ఇతర అధికారులు వాపోతున్నారు. ప్రతి రోజూ ఆ అధికారి విధులకు వచ్చారా అని కాకుండా.. ఆయనగారి కొడుకు.. చినబాబు వచ్చాడా.. వస్తే ఎక్కడున్నాడంటూ సిబ్బంది ఆరా తీస్తున్నారు. తమ సెక్షన్‌కు వస్తే ఏమంటాడో.. అసలు వచ్చేలా ఉన్నాడా అంటూ ఆ పుత్రరత్నానికి సహాయకుడిగా ఉండే అటెండర్‌ను అడిగి మరీ తెలుసుకుంటున్నారు. ఎదురుపడితే ఏమంటాడో అని హడలెత్తుతున్నారు.

అధికారిక సమావేశంలో..

దేవస్థానం భద్రతకు ఉపయోగించే డ్రోన్ కెమెరాల కొనుగోలు విషయమై ఆ కంపెనీ ప్రతినిధులతో రత్నగిరిపై ఆ అధికారి కార్యాలయంలో సోమవారం ఒక సమావేశం జరిగింది. ఇందులో ఆ అధికారితో పాటు ఈఈ లు, డీఈలు ఏఈఓలు, సూపరింటెండెంట్లు, సెక్యూరిటీ అధికారి పాల్గొన్నారు. అదే సమావేశంలో ఆ అధికారి పుత్రరత్నం చినబాబు కూడా పాల్గొనడం చూసి వారందరూ కంగు తిన్నారు. డ్రోన్ కెమెరాల గురించి ఆ అధికారికి బదులు చినబాబే ప్రశ్నించడం మరో విడ్డూరం. ఏ హోదా ఉందని అతడిని ఇలా అనుమతిస్తున్నారంటూ సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. ఇటువంటి సమావేశాల్లో చినబాబు పాల్గొన్నప్పుడు ఎవ్వరినీ ఫొటోలు, వీడియోలు తీయనివ్వరు. ఆ అధికారి సీసీ మాత్రమే ఫొటోలు, వీడియోలు తీస్తారు. ఫొటోల్లో ఆ చినబాబోరిని కట్ చేసి, మిగిలిన ఫొటోలను దేవస్థానం సెక్షన్ హెడ్స్ గ్రూపులో పెడుతున్నారు. చినబాబు పాల్గొన్న ఫొటో బయటకు వస్తే అసలుకే ఎసరొస్తుందనే ఉద్దేశంతో ఈ జాగ్రత్త తీసుకుంటున్నారు.

చినబాబుగారి పెత్తనం ఇలా..

- దేవస్థానంలో సీసీ టీవీలు పరిశీలించే అధికారం, సంబంధిత లింక్ దేవస్థానంలో కీలకమైన నలుగురికి మాత్రమే ఉంటుంది. కానీ, ఆ అధికారి పుత్రరత్నానికి కూడా ఆ లింక్ ఇచ్చారు. దీంతో ఆయన వాటిని చూసి, సిబ్బందికి డైరెక్షన్లు ఇస్తున్నాడు. ఆ నోటా ఈ నోటా ఈ విషయం అందరికీ తెలియడంతో ఆ అధికారికి, మరో కీలక వ్యక్తికి తప్ప అందరికీ ఆ లింక్ తొలగించారు. పాస్‌వర్డ్ కూడా మార్చేశారు.
- దేవస్థానానికి వచ్చిన ప్రతిసారీ చినబాబు సీసీ టీవీలుండే కమాండ్ కంట్రోల్ రూముకు వెళ్లి కొంతసేపు ఆ టీవీలు పరిశీలిస్తారు. ఆ సమయంలో ఎవ్వరూ లోపలకు రాకుండా బయట ఒకరు కాపలాగా ఉంటారు. ఆయన ఇచ్చే సలహాలు, సూచనలను అక్కడి సిబ్బంది పాటించాలి.
- పీఆర్‌ఓ కార్యాలయాన్ని చినబాబు సందర్శించినప్పుడు అక్కడ సిబ్బంది ఎవ్వరూ లేకపోవడంతో అవమానంగా భావించారు. దీంతో, అక్కడ అర్జెంట్‌గా ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో మర్నాడే అక్కడ ఆ ఏర్పాటు చేశారు.
- ఒక రోజు స్వామివారి నిత్యకల్యాణం, ఆన్‌లైన్ వ్రతం జరిగే కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరును పరిశీలించి సూచనలు ఇచ్చారు.
- ఆ అధికారి గత నెలలో రెండు రోజుల సమావేశానికి విజయవాడ వెళ్లినపుడు ఆయన అధికారిక వాహనంలోనే చినబాబు నేరుగా దేవస్థానానికి వచ్చారు. దర్జాగా ఆ అధికారి కూర్చునే ముందు సీటులో కూర్చుని పెత్తనం చేశారు. ఈ విషయం తెలిసి అందరూ అవాక్కయ్యారు. వాస్తవానికి అధికారి లేనపుడూ ఆ కారును వేరొకరు ఉపయోగించకూడదు. కుటుంబ సభ్యులైనా సరే ఆ అధికారితో పాటు ప్రయాణించినప్పుడే ఆ వాహనం ఎక్కాలి. కానీ, ఆ నియమాలన్నీ ఇక్కడ గాల్లో కలుస్తున్నాయి.
- దేవస్థానానికి మరో వాహనం కూడా ఉంది. చిన్నబాబు కొన్నిసార్లు ఆ వాహనంలో కొండ పైకి వచ్చి, అనధికారిక పర్యవేక్షణ అనంతరం తిరిగి కొండ దిగువకు అదే వాహనంలో వెళ్తున్నారు.
- దేవస్థానానికి వచ్చినపుడు పర్యవేక్షణ అనంతరం ఆ అధికారి కార్యాలయానికి ఎదురుగా ఉన్న వీఐపీ గదిలో చినబాబు సేద తీరుతారు. అప్పుడు ఆ అధికారి మాదిరిగానే ఆ పుత్రరత్నానికి కూడా మర్యాదలు చేయాల్సిందే.
- గతంలో ఎంతో మంది అధికారులు వచ్చినా వారి పిల్లలు ఎలా ఉంటారో కూడా సిబ్బందికి తెలియదు. ఉత్సవాల సమయంలో వచ్చి వెళ్లిపోవడం తప్ప ఎప్పుడూ ఇలాంటి వ్యవహారం చూడలేదని సిబ్బంది చెబుతున్నారు.
- ఆ పుత్రరత్నం ఓవర్ యాక్షన్ దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు తెలిసినా ఎందుకనో కానీ మౌనం వహిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, సరైన ఆధారాల కోసం ఎదురు చూస్తున్నారనే చర్చ కూడా నడుస్తోంది. దేవస్థానంలో సీసీ టీవీలు పరిశీలిస్తే చినబాబు కదలికలు తెలిసిపోతాయని పలువురు అంటున్నారు. ఉన్నతాధికారులు చినబాబు అజమాయిషీకే కత్తెర వేస్తారో లేక ఆ అధికారికే ఉద్వాసన పలుకుతారో వేచి చూడాల్సిందే.

అమ్మగారి పెత్తనం కూడా..

దేవస్థానంలో రోజూ సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించే సహస్ర దీపాలంకార సేవకు టికెట్ రూ.200. దీనికి అవసరమైన సామగ్రి, మండప నిర్మాణాన్ని పెద్దాపురానికి చెందిన దాత మట్టే సత్యప్రసాద్ విరాళంతో చేయించారు. ఈ సేవకు టికెట్టు కొనుగోలు చేసే భక్తులు తక్కువే అయినా, దీనిని దేవస్థానం ప్రతి రోజూ నిర్వహిస్తోంది. ఈ సేవలో టికెట్టు కొనుగోలు చేసిన భక్తులు ముందు వరుసలో కూర్చుంటారు. వారి గోత్ర నామాలతో పూజ చేస్తారు. ఇతర భక్తులు కొంచెం దూరంగా కూర్చుని ఆ సేవ చూస్తూంటారు. అయితే టికెట్ ఉన్నవారే ఈ సేవ చూడాలని, కొనని వారు చూడరాదని ఆ అధికారి భార్య హుకుం జారీ చేశారు. దీంతో ఆ సేవ జరిగే మండపంలోకి టికెట్లు లేని వాళ్లు వెళ్లకుండా సిబ్బంది చర్యలు తీసుకున్నారు. పది రోజుల్లో ఇది కాస్తా వివాదాస్పదమవడంతో ఆలయ సిబ్బందిపై దేవస్థానం చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేసి, ఆ పద్ధతికి స్వస్తి చెప్పారు.

భక్తుల అసంతృప్తికి కారణమేమిటి?

- మూడు నెలల్లో ఎందుకు మెరుగుదల లేదు?
- అన్నవరం దేవస్థానంలో ఐవీఆర్ఎస్ బృందం పర్యటన

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో అందిస్తున్న సేవలపై భక్తుల్లో అసంతృప్తి ఎందుకు నెలకొని ఉందనే అంశంపై ఇద్దరు వ్యక్తులతో కూడిన ఐవీఆర్ఎస్ బృందం స్వయంగా అభిప్రాయ సేకరణ చేస్తోంది. ఈ బృందం మంగళవారం అన్నవరం దేవస్థానానికి వచ్చింది. వీరు రెండు రోజుల పాటు దేవస్థానంలోనే ఉండి సర్వే నిర్వహించనున్నారు. మూడు నెలలుగా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాలకు వస్తున్న భక్తుల అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ఎస్ పద్ధతిలో సేకరించి, ర్యాంకులు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. దీని ప్రకారం అన్నవరం దేవస్థానానికి ఫిబ్రవరిలో చిట్టచివరి ఏడో ర్యాంకు వచ్చింది. మార్చిలో రెండో ర్యాంకు వచ్చినా, భక్తుల్లో అసంతృప్తి అదే విధంగా ఉంది. తాజాగా ఏప్రిల్ 4న విడుదల చేసిన ర్యాంకుల ప్రకారం భక్తుల అసంతృప్తి ఇంకా పెరిగినట్టు వెల్లడైంది. మార్చి 20 - ఏప్రిల్ 4వ తేదీల మధ్య చేసిన అభిప్రాయ సేకరణలో దర్శనంలో రెండో ర్యాంకు, మౌలిక వసతుల్లో ఆరో ర్యాంకు, సత్యదేవుని ప్రసాదం రుచిలో రెండో ర్యాంకు వచ్చాయి. గతంలో సేకరించిన అభిప్రాయ సేకరణ ప్రకారం దర్శనంపై 70 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, ఈసారి అది 69 శాతానికి, మౌలిక వసతులపై గతంలో 65 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా ఈసారి 60 శాతానికి, ప్రసాదం రుచి, నాణ్యతలో గతంలో 82.4 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా ఈసారి 80 శాతంగా నమోదైంది. ఈ నేపథ్యంలో ఎందుకు సంతృప్తి చెందడం లేదనే అంశంపై ఐవీఆర్ఎస్ బృందం భక్తుల అభిప్రాయాన్ని స్వయంగా తెలుసుకుంటోంది. ఈ బృందం పర్యటనను గోప్యంగా ఉంచారు. ఈ బృందానికి సహాయం చేయడానికి ఒక డీఈ, ఒక సూపరింటెండెంట్‌ను దేవస్థానం అధికారులు నియమించారు.

క్లుప్తంగా

లారీని ఢీకొన్న అంబులెన్స్

ముగ్గురికి గాయాలు

దేవరపల్లి: ఏలూరు నుంచి రోగిని తీసుకుని కాకినాడ వెళుతున్న అంబులెన్స్ దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగితో పాటు అతనికి తోడుగా ఉన్న కుటుంబ సభ్యుడు, అంబులెన్స్ డ్రైవర్ తీవ్రగా గాయపడ్డారు. మరొక అంబులెన్స్‌లో క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏలూరు నుంచి కాకినాడ వెళుతున్న అంబులెన్స్ అతివేగంగా వెళుతూ అదుపు తప్పి మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టినట్టు ఎస్సై వి.సుబ్రహమణ్యం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గల్లంతైన యువకుల మృతి

కొవ్వూరు: సీతంపేట సమీపంలో విజ్జేశ్వరం ఆనకట్టకి దిగువన చిగురులంకలో గోదావరి నదిలో స్నానాలకు దిగి గల్లంతైన యువకులు మృతిచెందారు. వారి మృతదేహాలను సోమవారం అర్ధరాత్రి పోలీసులు గుర్తించారు. నిడదవోలు చర్చిపేటకి చెందిన మర్తి ప్రకాష్‌కుమార్(15), గంధం హర్ష(18) నదీ స్నానాలకు దిగి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ ఇద్దరు యువకులు మృతి చెందడంతో జాలర్ల సాయంతో మృతదేహాలను వెలికి తీశారు. మృతదేహాలను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను యువకుల బంధువులకు అప్పగించినట్లు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

ఈదుకుంటూ మృత్యుఒడికి..

- ఈ నెలలోనే ఆరు ప్రమాదాలు– తొమ్మిది మంది మృతి
- ఐదేళ్లలో 291 ప్రమాదాలు, 308 మంది మృత్యువాత
- స్వీయరక్షణ, భద్రత చర్యలు తీసుకోవాలంటున్న నిపుణులు



రావులపాలెం వద్ద గోదావరిలో పడవలపై గాలిస్తున్న గజ ఈతగాళ్లు (ఫైల్)



బడుగువానిలంకలోని గోదావరిలో మునిగి మృతిచెందిన బాలురు (ఫైల్)

ఆలమూరు: వేసవికాలం వచ్చేసింది..విద్యార్థులకు పరీక్షలు ముగిసాయి.. యువకులు, పర్యాటకులు సముద్ర, నదీ పరివాహక ప్రాంతాల్లోని అనువుగా ఉండే ప్రదేశాల్లో స్నానాలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే గోదావరిలో స్నానం చేసే సమయంలో కాని ఈత కొట్టే సమయంలో కాని ఏమాత్రం ఏమరపాటు ప్రదర్శించినా మృత్యువాత పడతామని, తల్లిదండ్రులను ఒంటరివాళ్లను చేస్తామని మాత్రం ఊహించడం లేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, అమలాపురం, రామచంద్రపురం, మండపేట, ముమ్మిడివరం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కొవ్వూరు నియోజకవర్గాల వెంబడి గౌతమీ, వశిష్ట, వైనతేయ గోదావరి నదులు 289 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంటాయి. స్థానికులతో పాటు వారి బంధువులు, స్నేహితులు, పర్యాటకులు నదీ తీరానికి వచ్చి ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు ఇష్టపడతారు. ఇదే క్రమంలో గోదావరిలోను, పంట కాలువల్లోను స్నానాలు చేస్తూ ఈత సరదాను తీర్చుకునే క్రమంలో అనేక మంది ప్రమాదవశాత్తూ మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. నదీ పరివాహక ప్రాంతంలో అనేక చోట్ల లోతులు, ఊబిలు ఉన్న సంగతి తెలియని పర్యాటకులు స్నానాలకు దిగి మృత్యువాత పడుతున్నారు.

చర్యలు చేపడుతున్నా...

ఆలమూరు, ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, పి.గన్నవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, అయినవిల్లి, సఖినేటిపల్లి, రాజోలు మండలాల్లోని పలు గ్రామాలతో పాటు కొవ్వూరు మండలంలోని మద్దూరులంక. సీతంపేట, విజ్జేశ్వరం లాకుల సమీపంలోని నదీ తీరాలు అత్యంత ప్రమాదకరంగా పేరుగాంచాయి. దీంతో పాటు అంతర్వేది, ఓడలరేవు, కాకినాడ, ఉప్పాడ సముద్ర తీరంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఎక్కువగా ప్రాణ నష్టం సంభవిస్తోంది. గోదావరి తీర ప్రాంతాల్లో స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు నష్ట నివారణ చర్యలు చేపడుతున్నా ప్రయోజనం కన్పించడం లేదు. గత ఐదేళ్లలో ప్రభుత్వ గణాంకాల ప్రకారం 291 ప్రమాదాలు జరగ్గా 302 మంది మృత్యువాత పడ్డారు. ఈ నెలలోనే ఇప్పటి వరకూ ఆరు ప్రమాదాలు జరగ్గా తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు.

ప్రమాదాల వివరాలు..

సంవత్సరం	కేసులు	మృతులు
2021	54	59
2022	63	67
2023	71	78
2024	78	80
2025 (ఇప్పటి వరకూ)	23	24
	291	308

నివారణకు చర్యలు

- ప్రమాదాల నివారణకు పంచాయతీరాజ్, హెడ్‌వర్క్స్‌శాఖ పోలీసుశాఖ ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలి.
- గోదావరి పరీవాహక ప్రాంతంలో పోలీసు గస్తీ ముమ్మరం చేయాలి. అవగాహన సదస్సులు నిర్వహించాలి.
- వేసవిలో గోదావరి తీరంలోకి ఇతర ప్రాంతాల వారు వస్తే ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది కౌన్సెలింగ్‌ను అందించాలి.
- ప్రమాదకరమైన అన్ని రేవుల వద్ద లోతు వివరాలు తెలియజేసే హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలి.
- స్నానానికి అనుమతి లేని ప్రదేశాల వివరాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి.
- స్నానాలు చేసేటప్పుడు, ఈత కొడుతున్నప్పుడు ప్రతి ఒక్కరూ స్వీయరక్షణ చర్యలు పాటించి సేఫ్టీ డ్రస్‌ను ధరించాలి.

అనుమతి లేని ప్రదేశాల్లో స్నానాలు వద్దు



గోదావరి తీరం వెంబడి అనుమతి లేని ప్రదేశాల్లో ఎవరూ స్నానాలకు దిగవద్దు. ఇప్పటికే తీరం వెంబడి గుర్తించిన ప్రమాదకరమైన ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్థానికుల సహకారంతో ప్రమాదాల తీవ్రతను తెలియజేస్తున్నాం. రద్దీ ప్రదేశాల్లో పోలీసుల గస్తీని ముమ్మరం చేశాం. పర్యాటక ప్రాంతాల్లో నిరంతరం పోలీసులను పహరాగా ఉంచుతున్నాం.

–సుంకర మురళీమోహన్, డీఎస్పీ, కొత్తపేట

ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాం



నదీ తీర ప్రాంతాల్లో ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. ధవళేశ్వరం దిగువ ప్రాంతాల్లో ఊబులు ఎక్కువగా ఉన్నందున తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి ఆ మేరకు ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాం. ఇటీవల వాడపల్లి తీర్థానికి వెళ్లే భక్తులను గోదావరి మీద నుంచి వెళ్లకుండా పోలీసుల సాయంతో కట్టడి చేసి ప్రమాదాలను ఆపగలిగాం.

– ఆర్.విశ్వనాథరాజు, హెడ్‌వర్క్స్ జేఈ, ధవళేశ్వరం తూర్పుగోదావరిజిల్లా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



నూకరత్నం (ఫైల్)



సూరాడ శివతో నూకరత్నం వివాహం చిత్రం

తుని రూరల్: తుని మండలం కె.సీతయ్యపేట గ్రామానికి చెందిన వివాహిత సూరాడ నూకరత్నం (26) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. సోమవారం రాత్రి కడుపు నొప్పితో బాధపడుతున్న నూకరత్నాన్ని కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక అందాల్సి ఉందన్నారు. నూకరత్నం, శివ (భార్యాభర్తలు) మధ్య ఏర్పడిన తగాదాలపై గతంలో రెండుసార్లు ఫిర్యాదులు అందగా ఇద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్టు ఎస్సై వివరించారు. మృతురాలికి

భర్తే హతమార్చాడని ఫిర్యాదు

తన కుమార్తెను భర్త సూరాడ శివ హతమార్చాడని మృతురాలు నూకరత్నం తల్లి యజ్జన వెంకటలక్ష్మి ఆరోపించింది. ఒకే గ్రామానికి చెందిన నూకరత్నం, శివలకు ఎనిమిదేళ్ల కిందట వివాహం అయ్యింది. వీరిద్దరికి వైష్ణవి, హర్షిత, ధనుష్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. తన కుమార్తెను అల్లుడు తరచూ వేధించేవాడని, రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులు నమోదు చేయలేదని ఆరోపించింది. దీంతో సూరాడ శివ విషం కలిపిన ఆహారంతో నూకరత్నాన్ని హతమార్చినట్టు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినప్పుడు కేసులు నమోదు చేసి శిక్షిస్తే నా కుమార్తె బతికేదని తల్లి వెంకటలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ చెప్పింది. హంతకుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, పిల్లలకు న్యాయం చేయాలని కోరింది.

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

- చెప్పుల దండ వేసిన దుండగులు
- ఆగ్రహించిన దళిత సంఘాల నేతలు
- శంఖవరంలో రహదారి దిగ్బంధం
- నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్
- ఎస్పీ హామీతో ఆందోళన విరమణ



దళిత సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్



శంఖవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

శంఖవరం: మండల కేంద్రమైన శంఖవరంలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడంతో దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం దళితవాడలో అంబేడ్కర్ విగ్రహం మెడలో చెప్పుల దండ చూసి స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న దళిత సంఘాల నేతలు శంఖవరం చేరుకుని నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనతో ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కత్తిపూడి – శంఖవరం ప్రధాన రహదారిని దిగ్బంధించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరగడం అంటే యావత్తు భారతజాతికి అవమానం జరిగినట్లు అని తెలిపారు. ఈ ఘటనకు కారకులైనవారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్పీ బిందు మాధవ్ ఘటనా స్థలానికి చేరుకుని 24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేస్తామన్నారు. దళిత సంఘాల నాయకులు సంయమనం పాటించాలని సూచించారు. ఎస్పీ హామీ మేరకు దళిత సంఘాలు నిరసన కార్యక్రమాన్ని విరమించుకున్నాయి. అడిషినల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, తుని సీఐ చెన్నకేశవరావు ఎస్పీ వెంట ఉన్నారు. దళిత సంఘాల నాయకులు శెట్టిబత్తుల కుమార్‌రాజా, టి.కిరణ్‌కుమార్, సోనిహుడ్, వెంకటరత్నం, చరమర్ల మదు, గోళ్ల శేఖర్, పులి సుధాకర్, పి.భరత్ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి : ముద్రగడ గిరిబాబు

భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. కులమతాలకు అతీతంగా సమసమాజ స్థాపన కోసం చిరస్మరణీయ కృషిచేసిన అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమన్నారు.

కేస్ షీటు మాయం

- జీజీహెచ్‌లో మెడిసిన్ పీజీ నిర్వాకం
- కేస్ షీటు పోవడంతో మృతదేహాన్ని ఇచ్చేది లేదన్న అధికారులు
- కుటుంబీకులు ఎదురు తిరగడంతో ఘర్షణ వాతావరణం
- వ్యయప్రయాసల కోర్చి ఇంటి పెద్ద మృతదేహాన్ని తీసుకెళ్లిన కుటుంబీకులు



జానా వీరాంజనేయులు మృతదేహం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం ఘర్షణ వాతావరణం నెలకొంది. ఓ మృతదేహానికి సంబంధించిన కేస్ షీటు మాయం కావడంతో వివాదం రాజుకుంది. కేస్ షీటు పోయిందని మృతదేహాన్ని ఇచ్చేది లేదని ఆసుపత్రి సిబ్బంది కుటుంబ సభ్యులకు చెప్పగా, పోగొట్టింది మీరేనంటూ కుటుంబీకులు ఎదురు తిరిగి ఘర్షణకు దిగడం అలజడికి కారణమైంది. తీవ్ర రూపం దాల్చుతున్న తరుణంలో మధ్యేమార్గాన్ని అనుసరించిన ఆసుపత్రి అధికారులు కుటుంబీకుల నుంచి లేఖ రాయించుకొని రాత్రి మృతదేహాన్ని అప్పగించారు. వివరాల్లోకి వెళితే, మండపేటకు చెందిన జానా వీరాంజనేయులు(60) మధుమేహ వ్యాధితో బాధపడుతుండగా కాలికి గాయమై ఇన్‌ఫెక్షన్ అయింది. దీంతో గత నెల 27వ తేదీన కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. 30న పాదం కింద సర్జరీ చేశారు. ఐసీయూలో చేర్చిన అనంతరం 3నుంచి 12వ తేదీ వరకు సర్జరీ వార్డులో ఉంచి వైద్య సేవలు అందించారు. 12వ తేదీ సాయంత్రం శ్వాస తీసుకోవడం కష్టంగా మారి వైద్యులకు సమాచారం అందించినా ఎవరూ రాలేదు. 13వ తేదీ ఉదయం వచ్చి పరీక్షలు చేసి తలలో రక్తం గడ్డకట్టిందని, నాలుగు గంటల ముందు గుర్తిస్తే ఇంజెక్షన్‌తో సమస్య పరిష్కారమయ్యేదని చెప్పారు. తాము రెండు రోజులుగా చెబుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించి కనీసం రాలేదని, ఈ పద్ధతి ఏంటని కుటుంబీకులు ప్రశ్నించారు. దీంతో పీజీ వైద్యురాలు తన్మయి తమపై మండి పడిందని కుటుంబ సభ్యులు వాపోయారు. చికిత్స అందించడంలో తీవ్ర జాప్యం జరగడంతో తన తండ్రి మంగళవారం ప్రాణాలు కోల్పోయాడని కుమారుడు కృష్ణ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పీజీ వైద్యురాలు తన్మయి తనతో కేస్ షీటు మీద సంతకం పెట్టించుకొని నర్సులకు అప్పగించకుండా వార్డులో ఉన్న బల్లమీదే వదిలేసి వెళ్లిపోయారని కృష్ణప్రసాద్ అన్నారు. ఆమె నిర్లక్ష్యంతో కేస్ షీటు పోయిందని అన్నారు. కేస్ షీటు పోవడంతో నిబంధనల ప్రకారం దొరికే వరకు మృతదేహాన్ని ఇవ్వొద్దని నర్సింగ్ సిబ్బందికి ఆదేశించడంతో వివాదం రాజుకుంది. పీజీ డాక్టర్ పోగొడితే మృతదేహాన్ని ఎందుకు ఇవ్వరని కుటుంబీకులు తిరగబడ్డారు. ఇచ్చేది లేదని సిబ్బంది భీష్మించగా, వివాదం ముదురింది. ఈ నేపథ్యంలో మధ్యేమార్గంగా కుటుంబీకుల చేత లేఖ రాయించుకొని మంగళవారం రాత్రి మృతదేహాన్ని అప్పగించారు.

పోషక విలువల లక్ష్మణ ఫలం



లక్ష్మణ ఫలం



గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఉలవకాయల నాగ లోవరాజు పొలంలో లక్ష్మణ ఫలం చెట్టు

పిఠాపురం: మన పురాణ పురుషులు అయిన రాముడు, సీత, లక్ష్మణుల పేర్లతో సీతాఫలం, రామఫలంతో పాటు ఇప్పుడు లక్ష్మణ ఫలం స్థానికంగా పండుతున్నాయి. పలువురు రైతులు తమ ఇళ్ల వద్ద, పొలాల్లోను వీటిని పండిస్తున్నారు. దీనిని తింటే క్యాన్సర్ తగ్గుతుందని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్న తరుణంలో వీటి పెంపకం చాలాచోట్ల పెరిగింది. దీనిని ఆంగ్లంలో సోర్‌సో గ్రావియోలా అని పిలుస్తారు. దీనిలో ప్రొటీన్, కాల్షియం, ఐరన్, పొటాషియం, ఫాస్ఫరస్, తయామిన్, రెబోఫ్లేవిన్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి ఎన్నో పోషక విలువలు ఉంటాయి. దీని జ్యూస్ తాగితే దానిలోని పోషక విలువలు ఇన్‌ఫెక్షన్లను నివారిస్తాయి. 12 రకాల క్యాన్సర్ కణాలను నాశనం చేసే సామర్థ్యం ఈ లక్ష్మణ ఫలానికి ఉందని ఆయుర్వేదం చెబుతోంది. అందుకే లక్ష్మణ ఫలాన్ని తింటే మంచినిద్ర పట్టడంతో పాటు డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు దూరమవుతాయి. రక్తహీనతను తగ్గించే గుణం దీనిలో ఉంది. ఎముకలను దృఢంగా మార్చి కీళ్ల నొప్పులను నివారిస్తుంది. చెడు కొలస్ట్రాల్ కరిగి మంచి కొలస్ట్రాల్ పెరుగుతుంది. రక్తపోటు స్థాయిలు అదుపులో ఉంటాయి. నీరసం, అలసట దూరమై శరీరానికి మంచి శక్తి లభిస్తుంది. మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లతో బాధ పడే వారికి ఇది ఒక మెడిసిన్‌లా పని చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్ మాసాలలో ఈ పండ్లు అందుబాటులోకి వస్తాయి. పోర్చుగీసు నుంచి ఈ పండ్లు దిగుమతి అయినట్లు చెబుతుంటారు. వీటిని పండుగా తినడంతో పాటు స్వీట్లు, జ్యూస్‌లు, ఐస్‌క్రీంలు, జామ్‌ల తయారీలో వినియోగిస్తారు. ధర కిలో రూ.1,400 వరకు పలుకుతోందంటే దీని విలువ ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

ఏపీఎస్పీలో క్రీడా సంబరాలు



నాలుగు బెటాలియన్ల నుంచి హాజరైన ఏపీఎస్పీ క్రీడాకారులు



క్రీడాకారుల కవాతు

- రేంజ్ – 1 పరిధిలోని నాలుగు బెటాలియన్ల క్రీడాకారుల హాజరు
- మూడు రోజుల పాటు సందడి
- స్పోర్ట్స్‌మీట్‌ను లాంఛనంగా ప్రారంభించిన కమాండెంట్ నాగేంద్రరావు



గెలుపు దిశగా హై జంప్..



పరుగో పరుగు

కాకినాడ రూరల్: విధులతో నిత్యం టెన్షన్‌గా గడిపే ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక పోలీసులు(ఏపీఎస్పీ) ఉపశమనం పొందేలా, వారిలోని క్రీడాస్ఫూర్తిని తేటతెల్లం చేసేలా స్పోర్ట్స్ మీట్ – 2025 కాకినాడలో ఘనంగా ప్రారంభమైంది. మూడురోజుల పాటు రేంజ్ – 1 పరిధిలో జరగనున్న క్రీడా పోటీలకు 3వ బెటాలియన్ ఆతిథ్యం ఇచ్చింది. రమణయ్యపేటలో ఏపీఎస్పీ 3వ బెటాలియన్ పరేడ్‌లో క్రీడా పోటీలను కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు మంగళవారం ఉదయం శాంతి కపోతాలు, బెలూన్లు గాలిలో ఎగురవేసి లాంఛనంగా ప్రారంభించారు. విజయనగరం నుంచి 5వ, విశాఖపట్నం నుంచి 16వ, కాకినాడ నుంచి 3వ, మంగళగిరి నుంచి 6వ బెటాలియన్లకు చెందిన పోలీసు సిబ్బంది క్రీడా సంబరాలకు ఉత్సాహంగా హాజరయ్యారు. తమలోని ప్రతిభను చాటేందుకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీ పడ్డారు. తొలుత క్రీడాకారులు కవాతు, బ్యాండ్‌తో ఆకట్టుకున్నారు. కవాతు ద్వారా క్రీడాకారుల గౌరవ వందనాన్ని కమాండెంట్ నాగేంద్రరావు స్వీకరించారు. బెటాలియన్ నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎందరో ఎదిగారని, ముఖ్యంగా బాస్కెట్‌బాల్, వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరిచారన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా బాస్కెట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్, షాట్‌పుట్, క్రికెట్, హై జంప్ వంటి పోటీలను తొలి రోజు నిర్వహించారు. అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, మన్మథరావు, ఆర్ఐలు అజయ్‌కుమార్, రవిశంకరరావు, విశలేశ్వరరావు, ప్రసాద్, బెటాలియన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260